క్లుప్తంగా

ముగిసిన శిక్షణ



అధికారులతో శిక్షణ పొందిన సహాయకులు

భీమిని/వేమనపల్లి: నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న మంచినీటి సహాయకుల శిక్షణ సోమవారంతో ముగిసింది. శిక్షణ పొందిన సహాయకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. గ్రామాల్లో పైపుల లీకేజీలు ఉంటే రిపేర్లు చేసి, నీరు కలుషితం కాకుండా ప్రతి ఇంటికీ మంచినీరు అందేలా చూడాలన్నారు. అవసరమైన పనిముట్లను గ్రామ పంచాయతీ నిధుల నుంచి కొనుగోలు చేసి ఇస్తామని తెలిపారు. ప్రజలకు నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో భీమినిలో సూపరింటెండెంట్ ఇంజినీర్ రవీందర్, ఎంపీడీవో గంగామోహన్, డీఈ ప్రవీణ్‌కుమార్, ఏఈ పోషం, వేమనపల్లిలో మిషన్ భగీరథ ఈఈ వెంకటేశ్, మిషన్ భగీరథ ఏఈ నరేష్, భీమిని, కన్నెపల్లి, వేమనపల్లి మండలాల నీటి సహాయకులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం



దహనం చేస్తున్న వామపక్ష శ్రేణులు

బెల్లంపల్లి: పాలస్తీనా (గాజా)పై అమెరికా సామ్రాజ్యవాదం చేస్తున్న మారణహోమం ఏడాదికాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం బెల్లంపల్లిలో వామపక్షాల శ్రేణులు తీవ్ర నిరసన తెలిపారు. పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద అమెరికా దిష్టిబొమ్మను కాలబెట్టి నినాదాలు చేశారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు ఆడేపు రాజమౌళి, ఎండీ చాంద్‌పాషా, తాళ్లపల్లి శ్రీనివాస్, భూమయ్య, చరణ్, గోగర్ల శంకర్, తిరుపతి, టి.మణిరాంసింగ్, రత్నం రాజం, గుండా ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్డీవోకు వినతి



వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు

కోటపల్లి: గ్రామపంచాయతీల్లో నర్సరీల నిర్వహణ తమతో కాదని, నిర్వహణ భారం కార్యదర్శులపై మోపొద్దని సోమవారం మండలంలోని కార్యదర్శులు డీఆర్డీవో కిషన్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీల్లో నిధులు లేక అప్పుల పాలైనట్లు, మళ్లీ నర్సరీల నిర్వహణ కోసం అప్పులు చేయలేమని ఆవేదన వ్యక్తం చేశారు. నర్సరీల బాధ్యతలను ఈజీఎస్ సిబ్బందికి అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శులు పాల్గొన్నారు.

పండుగ పూట పస్తులేనా..?

- జీతాలు రాక ఔట్‌సోర్సింగ్, తాత్కాలిక ఉద్యోగుల అవస్థలు
- నస్పూర్‌లో ఐదు, లక్సెట్టిపేటలో మూడు నెలల వేతనాలు పెండింగ్
- అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కార్మికులు



పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న తాత్కాలిక సిబ్బంది

నస్పూర్: మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, తాత్కాలిక ఉద్యోగులకు జీతాలు రాక పండుగ పూట పస్తులుండాల్సిన స్థితిలో ఉన్నారు. అప్పులు పుట్టక అవస్థలు పడుతున్నారు. అయినా అధికారులు కనికరించడంలేదని కార్మికులు ఆరోపిస్తున్నారు. ప్రతీసారి ఈ నెల అయినా జీతాలు వస్తాయని ఎదురు చూడడం.. తీరా జీతాలు రాకపోవడంతో చేసేది ఏమీ లేక.. నిరుత్సాహపడడం తాత్కాలిక, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి పరిపాటిగా మారింది.

నస్పూర్, లక్సెట్టిపేటలో..

నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో తాత్కాలిక ఉద్యోగులుగా 86 మంది, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా 130మంది మొత్తం 216 మంది వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి ఐదు నెలలుగా జీతాలు చెల్లించడం లేదు. లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలో 60మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తుండగా మూడు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. మున్సిపల్ సాధారణ నిధుల నుంచి ప్రతినెలా జీతాలు చెల్లించాల్సి ఉంటుంది. అధికారులు జీతాలు చెల్లిచడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. కుటుంబ పోషణకు అప్పు చేయాల్సి వస్తోందని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు.

కార్మికులపై నిర్లక్ష్యం..

నస్పూర్ మున్సిపాలిటీలో ఇదివరకు వచ్చిన వేతనాల్లో ఈఎస్ఐ, ఈపీఎఫ్ డబ్బులు రికవరీ చేస్తున్నారు. కార్మికుల అకౌంట్లలో డబ్బులు జమ చేయకపోవడంతో బెనిఫిట్స్ కోల్పోతున్నారు. ప్రస్తుతం వేతనాల చెల్లింపుల్లో కూడా జాప్యం చేస్తుండడంతో అధికారుల నిర్లక్ష్యంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇష్టారీతిన ఉద్యోగుల నియామకం..

నస్పూర్ మున్సిపాలిటీలో పట్టణ ప్రగతిలో భాగంగా నర్సరీ, వాటర్ సప్‌ప్లై కామటీ, డ్రైవర్లు, వివిధ విభాగాల్లో విధులు నిర్వహించడానికి మున్సిపల్ అధికారులు కౌన్సిల్ ఆమోదంతో సుమారు 86మంది సిబ్బందిని తాత్కాలిక పద్ధతిలో నియమించారు. వారిని నిబంధనల ప్రకారం నిర్ణీత కాలపరిమితి ముగిసిన తరువాత విధుల నుంచి తొలగించాలి. లేదా కౌన్సిల్ ఆమోదంతో కాల పరిమితిని పొడగించాలి. కానీ నియామక సమయంలో కొందరు ప్రజాప్రతినిధులు మున్సిపాలిటీలో శాశ్వత ఉద్యోగాలు కల్పిస్తామని సిబ్బంది నుంచి రూ.లక్షలు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ కారణంతోనే కాలపరిమితి ముగిసినా తాత్కాలిక సిబ్బందిని తొలగించలేక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. నూతన పాలకవర్గం ఏర్పడిన కొద్దిరోజుల తరువాత సుమారు 19మంది కార్మికులను విధుల నుంచి తప్పించారు. కార్మిక సంఘం నేతల ఆందోళనతో వారిని తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. ఏదేమైనా తమ కష్టానికి ఫలితంగా రావాల్సిన జీతాలు, తమకు త్వరగా ఇప్పించాలని సిబ్బంది వేడుకుంటున్నారు.

త్వరలో వేతనాలు చెల్లిస్తాం



తాత్కాలిక, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి కొన్ని నెలలుగా జీతాలు చెల్లించకపోవడం వాస్తవమే. త్వరలో వేతనాలు చెల్లిస్తాం. వీలైతే రెండు, మూడు రోజుల్లో వేతనాలు చెల్లించడానికి అన్ని చర్యలు తీసుకున్నాం.

– సతీష్, మున్సిపల్ కమిషనర్, నస్పూర్

వన్యప్రాణుల సంరక్షణకు సహకరించాలి

మందమర్రిరూరల్: వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ గౌరీ శంకర్ కోరారు. వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా చిర్రకుంట గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ అడవులను, వన్యప్రాణులను కాపాడాలని కోరారు. సమావేశంలో అటవీ శాఖ అధికారులు శ్రీనివాస్, మంగ, తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: వన్యప్రాణి సంరక్షణతో భవిష్యత్‌లో పర్యాటక అభివృద్ధి జరుగుతుందని అటవీశాఖ డెప్యూటి రేంజ్ అధికారి ప్రవీణ్‌నాయక్ తెలిపారు. మండలంలోని ధర్మరావుపేట అటవీ సెక్షన్ పరిధి



అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

బుగ్గగూడలో వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా సోమవారం గ్రామస్తులకు అటవీ, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ కుమారస్వామి, వాచర్ పోశం, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంటల సందర్శన

కాసిపేట: ప్రస్తుతం వరిపంటలో ఆకు ముడత, కాండం తొలిచే పురుగు, బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగులు అధికంగా ఉందని మండల వ్యవసాయాధికారి చల్ల ప్రభాకర్ తెలిపారు. మండలంలోని మల్కేపల్లి గ్రామంలోని వరి పొలాలను సోమవారం ఆయన సందర్శించారు. రైతులకు పలు సూచనలు, జాగ్రత్తలు వివరించారు. ప్రస్తుతం వరిపంట పిలక దశ నుంచి పొట్ట దశలో ఉందని ఆకుముడత, కాండం తొలిచే పురుగు, ఆకు ఎండు తెగులు ప్రబావం ఎక్కువ ఉన్నందునా నివారణ మార్గాలు, వినియోగించాల్సిన మందులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈవో దీప్తి, రైతులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకల ఏర్పాట్లపై సమీక్ష

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో నిర్వహించే సద్దుల బతుకమ్మకు అన్ని ఏర్పాట్లు చేయాలని మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ సంబంధిత అధికారులకు సూచించారు. జీఎం కార్యాలయం ఆవరణంలోని కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత అధికారులతో సోమవారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో అధికారులకు పలు సూచనలు చేశారు. మందమర్రి ఏరియాలోని సింగరేణి కార్మిక కుటుంబాలతో పాటు పరిసర ప్రాంతాల మహిళలు చాలా మంది ఈ వేడుకల్లో పాల్గొంటారని, వేడుకల్లో భాగంగా మందమర్రి సింగరేణి హైస్కూల్, రామకృష్ణాపూర్‌లోని ఠాగూర్ స్టేడియంలను బతుకమ్మ వేడుకలకు



అధికారులతో మాట్లాడుతున్న జీఎం దేవేందర్

సిద్ధం చేయాలని, అధికారులకు సూచించారు. సమావేశంలో ఏరియా ఎస్‌వోటు జీఎం రాజేశ్వర్ రెడ్డి, కేకే గ్రూప్ ఏజెంట్ రామదాసు, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఐఈడీ రాజన్న, డీజీఎం (సివిల్) శ్రీనివాసులు, డీవైపీఎం ఆసిఫ్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

ముగిసిన మండలస్థాయి క్రికెట్ పోటీలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి శివారులోని మైదానంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు సోమవారం ముగిశాయి. మొత్తం 9జట్లు పాల్గొనగా వేంపల్లి–దొనబండ గ్రామాల జట్లు ఫైనల్‌లో తలపడ్డాయి. వేంపల్లి జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టుకు రూ.10వేల నగదు పారితోషికం, ట్రోఫీని, రన్నరప్ జట్టు అయిన దొనబండ జట్టుకు రూ.5వేల నగదు పారితోషికంతో పాటు ట్రోఫీని హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రతిభ, మంచిర్యాల మార్కెట్ కమిటీ డైరెక్టర్ తనుగుల సత్తయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ ఒడ్డె బాలరాజు, మాజీ సర్పంచులు డేగ బాపు, గోనె సంజయ్‌రావు పాల్గొన్నారు.

‘నా కొడుకును ఆదుకోండి’

భీమిని: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన చిలుముల రాజ్‌కుమార్ ఈ నెల 3న లక్ష్మీపూర్‌లో గ్రామ పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో విద్యుత్ బల్బులు పెడుతుండగా విద్యుత్ షాక్ తగిలింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నా కొడుకు పనిచేస్తేనే పూట గడుస్తుందని, మమ్మల్ని ఆదుకోవాలంటూ బాధితుడి తండ్రి రాములు, గ్రామస్తులతో కలిసి సోమవారం ఎంపీడీవో గంగామోహన్‌కు వినతిపత్రం అందజేశారు. నేను, నా భర్య రాజేశ్వరి దివ్యాంగులమని మా కుమారుడు రాజ్‌కుమార్‌ని ఆదుకోవాలని రాములు వేడుకున్నాడు. ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

బతుకమ్మ చీరలు పంపిణీ

మంచిర్యాలటౌన్: పట్టణంలోని ఐదో వార్డు సాయికుంటలో సోమవారం ఆవునూరి బానయ్య ఆధ్వర్యంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలందరికి చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ, వార్డు ప్రజలు, మహిళలు పాల్గొన్నారు

‘గ్రాడ్యుయేట్‌లకు సపోర్టు చేసే వారికే మద్దతు’

జన్నారం: త్వరలో జరిగే గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పెట్టుబడి దారులకు కాకుండా గ్రాడ్యుయెట్‌లకు అండగా ఉండే వారికి మద్దతు తెలుపాలని సోమవారం శాతవాహన యూనివర్సిటీ జేఏసీ చైర్మన్ చెన్నమల్ల చైతన్య పేర్కొన్నారు. సమావేశంలో ఎస్‌యూ జేఏసీ నాయకులు అరుణ్‌కుమార్, మహేశ్, అన్వేష్, మహేశ్, వెంకటేశ్, సాయి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

మందమర్రిరూరల్: నిబంధనలు పాటించని వైన్స్ షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కట్ట పవన్‌కుమార్, చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. బెల్లంపల్లిలోని ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో సోమవారం సీఐ ఇంద్ర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.

ప్రజావాణికి స్పందన కరువు

దండేపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి స్పందన కరువయ్యింది. అధికారులు హాజరైనప్పటికీ, అర్జీదారులు ఒక్కరు కూడా రాలేదు. దీంతో ప్రతి సోమవారం ఇక్కడ నిర్వహిస్తున్న ప్రజావాణికి స్పందన అంతంత మాత్రంగానే ఉంటుంది. చాలా మంది జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి హాజరవుతున్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

దండేపల్లి: మండలంలోని వెల్గనూర్ గ్రామానికి చెందిన నిరుపేద వృద్ధ దంపతులు సంగ చిన్నయ్య, గౌరవ్వలకు దండేపల్లి సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో సోమవారం రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, 25 కేజీల బియ్యం అందించారు. కార్యక్రమంలో భజన మండలి సేవాదళ్ కో ఆర్డినేటర్ సాయిరాం, జాయింట్ కో ఆర్డినేటర్ కుమారస్వామి, సభ్యులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న జీఎం దేవేందర్, అధికారులు

మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్): దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి ఆలయాల్లో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందమర్రి ఏరియా ఆర్కేపీ ఓసీలో నిర్వహించిన పూజ కార్యక్రమంలో ఏరియా జీఎం దేవేందర్, ఎస్‌వోటు జీఎం రాజేశ్వర్ రెడ్డి, పీవో గోవింద రావులు పాల్గొన్నారు. బీ–జోన్, రాజీవ్‌నగర్‌లోని ఓనర్స్, డ్రైవర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత ఆలయంలో చండీహోమం నిర్వహించగా కౌన్సిలర్ రేవెల్లి ఓదెలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పలు మండపాల వద్ద అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు.

అమ్మవారికి కుంకుమపూజలు



కుంకుమ పూజలు నిర్వహిస్తున్న భక్తులు

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని గోదావరి రోడ్ దుర్గామాత నవరాత్రి వేడుకల్లో భాగంగా సోమవారం శ్రీ సాయి గణేశ్ భక్త మండలి వారి ఆధ్వర్యంలో కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో పూజారి ముద్దు ప్రణవ్ కుమార శర్మ, శారద, సత్యనారాయణ, భక్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఐకే1ఏ, ఐకే–ఓసీపీపై చండీహోమం

జైపూర్: మండలంలోని ఇందారం ఐకే1ఏ, ఐకే–ఓసీపీపై దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత చండీహోమం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఏపీ.రెడ్డి, కెవీ.కృష్ణరావు, రామ్మోహన్ దంపతులు హోమం కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించగా అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



గనిపై హోమం చేస్తున్న అధికారులు

చెన్నూర్ అయ్యప్ప స్వామి ఆలయంలో...



చండీహోమంలో భక్తులు

చెన్నూర్: స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద సోమవారం చండీయాగం కనుల పండువగా నిర్వహించారు. దుర్గామాత చండీహోమంలో దేవీ మాలలు ధరించిన యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అర్చకులు సత్యమూర్తి, మహేశ్వర్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కల్యాణం..కమనీయం

నస్పూర్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 6 గనిపై మైసమ్మ దేవాలయంలో శ్రీ దుర్గా మల్లికార్జున స్వామి కల్యాణం సోమవారం వైభవంగా నిర్వహించారు. గని మేనేజర్ తిరుపతి దంపతులు, సేఫ్టీ జీఎం రఘుకుమార్ దంపతులు, ఇతర కార్మికులు కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజ లు నిర్వహించారు. కార్యక్రమంలో కార్మికులు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



కల్యాణంలో పాల్గొన్న తిరుపతి దంపతులు

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి..!

- పర్సనల్ డిపార్టుమెంట్ కార్యాలయంలో వేడి
- ఏసీలు లేక నీరసించిపోతున్న క్లర్కులు, అధికారులు
- వేడికి హ్యాంగ్ అవుతున్న కంప్యూటర్లు
- కూలర్లు కూడా కరువే..
- జీఎం కార్యాలయంలోనే ఈ దుస్థితి



శ్రీరాంపూర్ పర్సనల్ డిపార్టుమెంట్ విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని కొత్తగా పై ఫ్లోర్‌లో నిర్మించిన పర్సనల్ డిపార్టుమెంట్ కార్యాలయంలో వేడికి క్లరికల్ సిబ్బంది, అధికారులు తడిసిపోతున్నారు. ఏసీలు లేకపోవడంతో అందులో పనిచేసే వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. డివిజన్‌లో పనిచేసే ఉద్యోగులందరి జీతభత్యాలు, వ్యక్తిగత రికార్డులు, వారి ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు, మెడికల్ ఇన్వాలిడేషన్ కేసులు, బదిలీలు, రిటైర్మెంట్ కేసులు, క్వార్టర్ల సమస్యలు ఇలా అన్ని రకాల ఉద్యోగి వ్యక్తిగత వ్యవహారాలను జీఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్టుమెంట్ చక్కబెడుతుంది. మొదటి నుంచి ఈ విభాగం కార్యాలయం గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉండేది. చుట్టూ చెట్లు, గ్రౌండ్‌ఫ్లోర్ కావడంతో ఫ్యాన్ల కిందైనా చల్లగానే ఉండేది. కింది గదులు ఆధునీకరణ చేయడంతో ఈ విభాగాన్ని పై ఫ్లోర్‌కు మార్చారు. రేకులతో నిర్మించిన పెద్దహాల్‌లో ఈ విభాగాన్ని ఏర్పాటు చేశారు. అధికారులు, క్లర్క్‌లు సుమారు 50మందికి ఒకే హాల్‌లో సీటింగ్ అరెంజ్‌మెంట్ చేశారు. 20కంప్యూటర్లు నిత్యం పని చేస్తుంటాయి.

మూడు వైపులా ఎండనే....

ఈ కార్యాలయం మూడు వైపులా ఎండ కాస్తుంది. ఉదయం 11దాటితే చాలు వేడి, ఉక్కపోత, హుమిడిటీతో సతమతం అవుతున్నారు. కిటికీలు ఉన్న వాటిని తీస్తే పక్కనే ఉన్న యన్‌హెచ్ 363రోడ్డు శబ్దాలు వినిపిస్తాయి. దుమ్ము కూడా లోపలికి విపరీతంగా వస్తుంది. దీంతో కొన్ని కిటికీలను ఎప్పుడు మూసేస్తారు. ముందు వైపు కూడా క్లోజ్డ్ రేకుల షెడ్డు లాబీ ఉంది. దీనికి తోడు ఒకే హాల్‌లో ఎక్కువ మంది ఉద్యోగులు పనిచేయడంతో వారి ఉచ్ఛ్వాస నిశ్వాసలు, నిత్యం పనిచేసే కంప్యూటర్లతో కార్యాలయం మొత్తం వేడెక్కిపోతుంది. దీంతో లంచ్‌కు ముందే చెమటకు దుస్తులు తడిసి ముద్దయి నీరసించి పోతున్నామని క్లరికల్ సిబ్బంది, అధికారులు వాపోతున్నారు. కంప్యూటర్లు తరచూ హ్యాంగ్ అవుతున్నాయని తెలిపారు. పనుల మీద కార్యాలయానికి వచ్చే ఉద్యోగులు సైతం నిమిషం కూడా లోపల ఉండలేకపోతున్నారు.

ఏసీ ప్రొవిజన్స్ మార్చాలి...

సింగరేణి కార్యాలయాల్లోనైనా కేవలం ఏజీఎం ర్యాంకు అధికారి మాత్రమే ఏసీ పెట్టే ప్రొవిజన్ ఉంది. అంతకంటే కింది స్థాయి అధికారులైన డీజీఎం, మేనేజర్లు, డెప్యూటీ మేనేజర్లకు ప్రొవిజన్ లేదు. కానీ కొత్తగూడెంలోని హెడ్ ఆఫీసులో మాత్రం మొత్తం సెంట్రల్ ఏసీ ఉంది. అక్కడ లేని నిబంధన ఏరియాలోని కార్యాలయాల్లో ఎందుకని ప్రశ్నలు ఉద్భవిస్తున్నాయి. ఈ పర్సనల్ డిపార్టుమెంట్‌లో ఏసీలు పెట్టుకోవడానికి అనుమతి ఇవ్వాలని పలుమార్లు ఏరియా అధికారులు కార్పొరేట్ అధికారులకు లేఖలు రాసినా, వారు ససేమిరా అన్నారు. వేసవిలో ఏప్రిల్, మే, జూన్ నెలలో టెండర్ ద్వారా కూలర్లు పెట్టి తరువాత తీసేయించారు. క్వార్టర్లకు ఏసీ పెట్టుకొనే సదుపాయం కల్పించి వాటికి ఉచిత కరెంట్ అందిస్తున్న కంపెనీ కార్యాలయాల్లో ఏసీలు, కూలర్లు పెట్టకపోవడం సరికాదని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఏసీ ప్రొవిజన్‌లపై కాలం చెల్లిన నిబంధనలు ఇకనైనా మార్చాలని క్లరికల్ సిబ్బంది, కింది స్థాయి అధికారులు డిమాండ్ చేస్తున్నారు. శ్రీరాంపూర్‌లోనే కాకుండా కంపెనీ వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో క్లరికల్ సిబ్బంది, అధికారులు పనిచేసే చోట ఏసీలు ఏర్పాటు చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనిపై కంపెనీ సీఎండీ, డైరెక్టర్లు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలిని డిమాండ్ చేస్తున్నారు.

‘ఉపాధి’ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

కోటపల్లి: మండలకేంద్రంలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులపై 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్డీవో కిషన్ ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వరకు మండలంలోని 31గ్రామపంచాయతీల్లో చేపట్టిన వివిధ పనులపై నివేదికలను చదివి వినిపించారు. ఉపాధి హామీ సిబ్బంది పని ప్రదేశంలో కూలీల మస్టర్లపై సంబంధిత అధికారులు రోల్ కాల్ చేయకపోవడం, కొలతల్లో తేడాలు, మస్టర్లలో కూలీల సంతకాలు, హాజరు లేకుండా వేతనాల చెల్లింపులు, మస్టర్ల హాజరు లెక్కింపుల్లో తప్పిదాలు, పని ప్రదేశం తేడాలు వంటి తప్పిదాలపై మండలంలోని 31గ్రామపంచాయతీలకు గాను రూ.26వేల 116లను రికవరీకి ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, భాస్కర్, ఏపీవో బాలయ్య, వెంకటేశ్వర్లు, ఉపాధిహామీ టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.



తనిఖీలో పాల్గొన్న డీఆర్డీవో, అధికారులు

చెట్ల తొలగింపుతో వివాదం

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం బుచ్చయ్యపల్లి గ్రామ శివారులో టేకు చెట్ల నరికివేతలో వివాదం చోటు చేసుకుంది. బుచ్చయ్యపల్లి గ్రామం నుంచి మందమర్రి మండలం చతులాపూర్ గ్రామం వరకు రూ.2.81కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులతో రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణంలో భా గంగా రోడ్డు పక్కన ఉన్న గ్రామానికి చెందిన యాదన వేణి రాజయ్య రైతు పొలంలో ఉన్న టేకు చెట్లను తొలగించాలని అధికారులు గతంలోనే సూచించారు. తాజాగా సోమవారం గ్రామస్తులు, అధికారులు రోడ్డు నిర్మాణం కోసం చెట్లను తొలగించడంతో రాజయ్యకు, గ్రామస్తులకు స్వల్ప వాగ్వివా దం చోటు చేసుకుంది. దీంతో తన చెట్లను అక్రమంగా తొలగించారని తాళ్లగురిజాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రాజ య్య పేర్కొన్నాడు. తనకు న్యాయం చేయాలని బాధితుడు వేడుకున్నాడు.